మాటువేసిన మృత్యువు

కె.వి.యస్.యన్. మూర్తి

అర్థరాత్రి పన్నెండు గంటలు కావస్తోంది.

ఆ ప్రాంతం అంతా చిక్కగా చీకటి పరుచుకొని వుంది. కీచురాళ్ళ రొద భయంకరంగా వినిపిస్తోంది.

నెమ్మదిగా అడుగులు వేస్తూ ముందుకు వెళుతున్నాడతను.

పచ్చటి శరీర ఛాయ, ఆరడుగుల రెండంగుళాల ఎత్తు, కసరత్తు చేయుటంవలన కండలు తిరిగిన శరీరం, వంకీలు తిరిగిన వత్తయిన జుత్తు, అందరినీ ఆకట్టుకునేలా వుండే కళ్ళు. అతని కళ్ళు—కనుబొమల క్రింద మివిట్లా మెరుస్తాయి. అతడి చూపులు ఎదుటి మనిషిలోంచి దూసుకుపోతోంటాయి. తన చుట్టూ వుండే ప్రతి కదలికను యిట్టే పసికడతాయి—అతని కళ్ళు.

వీధి దీపపు కాంతి సన్నగా రోడ్డుమీద పడుతోంది. ఆ దీపపు కాంతి తనమీద పడకుండా తప్పించుకుంటూ ముందుకు వెళ్ళాడతను. చిన్న పెంకుటింటిముందు ఆగాడు.

నెమ్మదిగా యింటి వెనకకు వెళ్ళాడు. మునివ్రేళ్ళతో దొడ్డిగుమ్మపు తలుపుమీద మూడుసార్లు సున్నితంగా కొట్టాడు.

ఆ శబ్దంకోసమే కాచుకున్నట్లుగా, అప్పటివరకు మూసుకొని వున్న తలుపులు ఒక్కసారిగా తెరుచుకున్నాయి. తలుపు వెనుక ఒక వయసు మళ్ళిన వ్యక్తి నిలబడి వున్నాడు. "రా! శివూ! రా!" అన్నాడతడు, బయట నిలబడ్డ యువకుడు లోపలకు రావటానికి వీలుగా తలుపుకు అడ్డం తొలుగుతూ.

శివరావు లోపలకు వచ్చాడు. "నమస్కారం మాస్టారూ!" అన్నాడు.

మాస్టారు తలుపుమూసి గడియవేశారు. శివరావు తలను ఆప్యాయంగా నిమిరారు. "కులాశానా?" అన్నారు.

శివరావు మౌనంగా తలాడించి, గదిమధ్య పరచిన మంచంమీద కూర్చున్నాడు. "ఉత్తరాలేమయినా వచ్చాయా మాస్టారూ?" అడిగాడు.

మాస్టారు గోడవారగా వున్న బల్లదగ్గరకు వెళ్ళారు. సొరుగులాగి యిన్‌లాండ్ కవరును బయటకు తీశారు. శివరావుకు ఆ కవరును అందించారు.

శివరావు కవరందుకున్నాడు.

మాస్టారు హరికేన్ లాంతరు వత్తిని పెద్దదిచేశారు. దీపపు కాంతిలో వుత్తరాన్ని ఆత్రంగా చదివాడు శివరావు.

ఆ ఉత్తరాన్ని చదువుతోంటే అతడి మొహంలో ఒకరకమైన కాంతి కనపడుతోంది. ఉత్తరాన్ని మడిచి జేబులో పెట్టుకున్నాడు శివరావు. మాస్టారి మొహంలోకి

ఒక్కసారి చూశాడు. ఆయన మొహంలో ఏ భావం కనపడలేదు.

"ఏం చేద్దాం — అనుకుంటున్నావు?" అడిగారు మాస్టారు.

"చెల్లెలు పెళ్ళి అవుతోంటే ఏ అన్నమాత్రం పెళ్ళికి వెళ్ళకుండా ఊరుకోగలడు మాస్టారూ?"

"అవును, కానీ — రేవుపాలెం సబ్ ఇన్స్పెక్టర్ సత్తిరాజు గురించి నీకు తెలుసున్నది చాలా తక్కువ. చండశాసనుడు. ఇప్పటికే మీ ఇంటిమీద కన్ను వేసి ఉంచాడు. నువ్వు పెళ్ళికి వచ్చితీరుతావని వూహించి పథకం తయారుచేసుకొని కూర్చున్నాడు. నువ్వుగానీ రేవుపాలెం వెళ్ళావో — అతడికి పట్టుబడటం ఖాయం."

శివరావు నిర్లిప్తంగా నవ్వాడు. ఆ నవ్వులో తెగింపు తప్ప మరేమీ లేదు. "మాస్టారూ! అన్నిటికీ తెగించినవాడిని. ఈమాత్రం చొరవ చెయ్యలేనా! నేను సరిగ్గా పెళ్ళి ముహూర్తానికి వస్తాను. మీరు ముందు వెళ్ళి పెళ్ళి యేర్పాట్లు చూడండి" అని, భుజానికి తగిలించుకున్న తోలుసంచీని మంచంమీద బోర్లించాడు శివరావు. మంచంమీద నోట్లకట్టలూ — బంగారు నగలూ కుప్పగా పడ్డాయి.

మాస్టారు ఆ నోట్లకట్టలవైపూ, నగలవైపూ అనుమానంగా చూశారు.

మాస్టార్ని చూశాడు శివరావు. "ఏం మాస్టారూ? అలా చూస్తున్నారు?" అన్నాడు.

"శివూ! నిన్నో ఓ బందిపోటుగా చూస్తానని ఏనాడూ అనుకోలేదురా? నువ్వు సంపాదించిన ఈ సొమ్ము ఎంత మంది రక్తంతో తడిసిందో! ఎంతమంది ఉసురు పోసు

ఉందో?"

శివరావు కళ్ళలోంచి నీళ్ళు రాలాయి. "మాస్టారూ! ఇంతవరకూ నేను యెవరి ప్రాణమూ తియ్యలేదు. నేను కొల్లగొట్టేది, పేదల రక్తం రుచిమరిగిన ధనమదాంధులను మాత్రమే! కండకావరంతో కళ్ళు మూసుకుపోయిన భూస్వాములను మాత్రమే! నన్ను నమ్మండి మాస్టారూ!" అన్నాడు.

మాస్టారు అతడిని ఆప్యాయంగా చూశారు. "చాలయ్యా! నాకు ఆమాత్రం సంతృప్తిచాలు" అన్నారు.

"నేను వెళ్తాను మాస్టారూ! మళ్ళీ తెల్లవారితే వెళ్ళటం కష్టం" అన్నాడు శివరావు.

"జాగ్రత్త నాయనా!" అన్నాడు మాస్టారు.

శివరావు మంచంమీదనుండి లేచి నిలబడ్డాడు. అమాంతం మాస్టారి కాళ్ళమీద పడ్డాడు. మాస్టారు కంగారుపడ్డారు. శివరావుని పైకి లేపారు. "ఛ! ఏమిటిది?" అన్నారు.

"మీ రుణం ఈ జన్మకు తీర్చలేను మాస్టారూ! నా చర్మంతీసి మీకు చెప్పులు కుట్టించి యిచ్చినా అది తీరదు మాస్టారూ!"

అతడు అంత బేలగా ప్రవర్తించటం మాస్టారు యెప్పుడూ చూడలేదు. "మీ నాన్న — నా కుటుంబానికి చేసిన సాయం అంతా యింతా కాదురా? మీ గురించి నేను ఈ మాత్రం చెయ్యకపోతే పురుగులు పట్టి పోతాను" అన్నారు మాస్టారు.

శివరావు ఇంకేమీ మాట్లాడలేదు. మౌనంగా బయటకు వెళ్ళిపోయాడు.

రామయ్య మాస్టారు అతను వెళ్ళినవైపే చూస్తూ

నిలబడిపోయారు. ఎందుకో ఆయన కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.

నారాయణరావే కనక బ్రతికి ఉంటే....శివు.... మరోలా ఉండి ఉండేవాడు. పాపం శివుతల్లి తాయారమ్మగారు కొడుకుని చూడాలని — కళ్ళలో వత్తులు వేసుకొని మరీ చూస్తోంది. దీప్తి అయితే అన్నగారిని చూసేగాని పెళ్ళిచేసుకోనని మొరాయించింది. పాపం వాళ్ళకేం తెలుసు — శివు చుట్టూ ఉచ్చులు యెలా బిగుసుకున్నాయో! ఆ దేవుడు చల్లగా చూసి పెళ్ళి యే యిబ్బందీ లేకుండా జరిగిపోతే బావుండును.

రామయ్యగారు తలుపు దగ్గరగా వేశారు. దీపం వత్తి చిన్నది చేసి మంచంమీద నడుం వాల్చారు. నెమ్మదిగా కళ్ళుమూసుకున్నారు. ఆయన మనసు అంతా తన బాల్య స్నేహితుడు నారాయణరావు తాలూకు వూహాలతో నిండిపోయింది.

అలా ఆలోచిస్తూనే మరి కాస్సేపటిలో నిద్రలోకి జారుకున్నారు రామయ్యగారు.

2

ఆ రోజు విక్టోరియా కాలేజి ఆవరణ అంతా చాలా కోలాహలంగా ఉంది.

మైదానం మధ్య పెద్ద స్టేజిని తయారుచేశారు. స్టేజ్ మీద వరుసగా కుర్చీలు వేశారు. ప్రిన్సిపాల్ గారయితే కాలుకాలిన పిల్లిలా అటూ యిటూ తిరుగుతున్నారు.

ఆ వేళకి సరిగ్గా ఆ కాలేజీ స్థాపన జరిగి పాతిక సంవత్సరాలయింది. అందుకే ఆ రోజు సిల్వర్ జూబ్లీ జరుగుతోంది. ఆ రోజు కార్యక్రమానికి రాష్ట్రపతి ఛీఫ్

గేస్టు.

అడుగడుగునా సెక్యూరిటీ గార్డులు నిలబడి వున్నారు. మైదానంలోపలకు వెళ్ళే జనాన్ని పూర్తిగా చెక్ చేసి మరీ పంపుతున్నారు. మెటల్ డిటెక్టర్ సహాయంతో సైకిలు తాళాలనుకూడా బయటకు తీసి చూస్తున్నారు.

సాయంత్రం నాలుగు గంటలయ్యేటప్పటికి మైదానం అంతా విద్యార్థులతోనూ, వారి తల్లిదండ్రులతోనూ, ఆహ్వానితులతోను నిండిపోయింది. ఫంక్షన్ ప్రారంభమయ్యింది. వేదికమీద ప్రముఖులు ఆశీనులయ్యారు. ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందింపబడ్డాయి.

ప్రిన్సిపాల్ లేచి మైకు దగ్గరకు వచ్చారు. తమ ఆహ్వానాన్ని మన్నించి ఫంక్షన్‌కు వచ్చినందుకు కాలేజీ కమిటీ తరుపునా, విద్యార్థుల తరపునా, అధ్యాపక సిబ్బంది తరఫునా రాష్ట్రపతికి ధన్యవాదాలు సమర్పించాడు. తరువాత తన కాలేజీ గొప్పతనాన్నీ, ఆ కాలేజీలో చదువుకున్నవారు ఎంతెంత పెద్ద స్థానాలలో ఉన్నారో వివరించి చెప్పాడు. అలా చెపుతున్నప్పుడు ఆయన స్వరంలో గర్వం తొణికిసలాడింది. ప్రిన్సిపాల్ తను చెబుతున్నది ఒక్క క్షణం ఆపాడు.

“ఈ శుభముహూర్తంలో, ఒక చేదును ప్రస్తావించక తప్పదు” అంటూ మళ్ళీ తన ఉపన్యాసాన్ని కొనసాగించాడు ప్రిన్సిపాల్.

“రాముడు పుట్టిన ఈ దేశంలో రావణుడూ పుట్టేడు, గాంధీలున్న సమాజంలో గాడ్సేలూ ఉంటారు. అలాగే ఎంతోమంది విజ్ఞానవేత్తలనూ, దేశభక్తులనూ తయారు చేసిన మన కాలేజీ, ఒక పచ్చి రౌడీని, దోపిడీ దొంగను కూడా తయారుచేసింది. అతడి పేరు శివరావు.

అతడు మన కాలేజీలో ఉన్నంతకాలం చాలా చక్కగా బుద్ధిమంతుడిలాగా ప్రవర్తించాడు. ఎప్పుడూ ఫస్టే వచ్చేవాడు. అతడికి మంచి భవిత ఉందని మేమందరం ఉద్దేశపడ్డాం. కానీ అతడి తెలివి మంచికి పనికి రాకుండా పోయింది. పెడదారి పట్టింది. ఏమొచ్చిందో యేమో మన ఎమ్.ఎల్.ఏ. నాయుడిని అమానుషంగా హత్యచేశాడు. పోలీసులకు దొరకకుండా పారిపోయాడు. ప్రస్తుతం నల్లమలై అడవుల్లో జరుగుతున్న దోపిడీల వెనుక అతని హస్తం ఉందని నిశ్చయంగా తెలిసింది.

శివరావును పట్టుకున్నవారికి పోలీసుశాఖ పాతిక వేల రూపాయల బహుమానాన్ని ప్రకటించింది. మన కాలేజీ విద్యార్థులు యెవరైనా సాహసంచేసి శివరావును పట్టుకుని చట్టానికి అప్పజెబితే మన కాలేజీ తరపున మరో పాతిక వేల రూపాయల నగదును బహుకరించాలని నిర్ణయం జరిగింది. ఈ గౌరవాన్ని పొందడానికి ప్రతీ విద్యార్థీ కృషి చేస్తారని ఆశిస్తాను. మన కాలేజీ తయారు చేసిన ఒక సంఘ విద్రోహక శక్తిని మనమే అంతమొందిద్దాం" అంటూ తన ఉపన్యాసాన్ని ముగించారు ప్రిన్సిపాల్.

తరువాత రాష్ట్రపతి ప్రసంగించారు.

వందన సమర్పణ అయింది.

ఒక్కొక్కరూ బయటకు వెళుతోన్నారు.

ఎవరి నోటంట విన్నా శివరావు ప్రస్తావనే.

"నాకు రెండేళ్ళు సీనియర్ రా!"

"మా అన్నయ్యకు క్లాస్‌మేట్ ....రోజూ మా ఇంటికి వచ్చేవాడు."

"శివాలయం వీధిలో ఉండేవాడు."

"మన ఓల్డు స్టూడెంట్సు అసోసియేషన్‌కు ప్రెసిడెంట్ ...."

ఇలా యెవరికి తోచింది వాళ్ళు చెబుతున్నారు.

అందరి తలంపూ శివరావు గురించే. అతడిని యెలా పట్టుకోవాలా?.... బహుమతి సొమ్ము, ఏభైవేల రూపాయలన్నా యెలా సంపాదించాలా? ఎలా పేరు తెచ్చుకోవాలా? అన్న ఆలోచనలతో అందరి వూహాలూ నిండి పోయాయి.

ఎవరితోటీ సంబంధంలేనట్లుగా వసుధ మాత్రం అన్యమనస్కంగా నడుస్తోంది. ఆమెకు కూడా శివరావు విషయంలో ఎడ్వంచర్ చెయ్యాలని ఉంది. డబ్బు గురించీ, పేరు గురించీ, కాకపోయినా, సంఘ విద్రోహక శక్తులను అణచటం ఒక భారతనారిగా తన ధర్మం అనుకుంది వసుధ.

వెనక — కారు హారన్ వినేటప్పటికి వసుధ ఉలిక్కిపడి వెనక్కి చూసింది.

తెల్లటి అంబాసిడర్ కారులో కూర్చుని వసుధను చూసి వెకిలిగా నవ్వుతున్నాడు అంజిబాబు.

"కమిన్ బేబీ! వచ్చి కారులో కూర్చో! ఇంటి దగ్గర దింపుతాను" అన్నాడు అంజిబాబు.

వసుధ అతడిని అసహ్యంగా చూసింది. కానీ ఆ అసహ్యాన్ని పైకి కనపడనీయకుండా మొహానికి నవ్వు పులుముకుంది. "అక్కర్లేదు. డాడీ వస్తానన్నారు" అంది.

అంజిబాబు సంగతి వసుధకు బాగా తెలుసు. అతడి తండ్రే యిందాక ప్రస్తావనకు వచ్చిన నాయుడుగారు. నాయుడు పదవిలో ఉండగా చెయ్యని అక్రమంలేదు. తండ్రి బుద్ధులన్నీ పుణికిపుచ్చుకు పుట్టేడు అంజిబాబు.

పగపట్టిన నాగుపాముకన్నా భయంకరంగా మారిపోతాడు అంజిబాబు.

వసుధపై అంజిబాబు కన్ను ఈ మధ్యనే పడింది.

వసుధ బాగా తెలివయినది. అంజిబాబును ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచింది. 'అతడిని ఛీకొట్టి బ్రతకడం కష్టం' అని తెలుసుకుంది. అందుకే అతడితో యెప్పుడు మాట్లాడినా ముఖానికి నవ్వు పులుముకుంటుంది. అతడు ప్రతిఘటించినట్లయితే అతడిని మౌనంగా తిరస్కరిస్తుంది. సిగ్గును అభినయిస్తుంది.

వసుధ మనసును తెలుసుకోలేక తికమక పడిపోతోన్నాడు అంజిబాబు. ఏమాత్రం తొందరపడినా మొదటికే మోసం వస్తుందని గ్రహించి నిదానంగా ప్రవర్తిస్తోన్నాడు. అతడి ప్రవర్తనలోని అంతర్యాన్ని పసికట్టింది వసుధ. అది తుఫాను వచ్చేముందు ఏర్పడే నిశ్శబ్దం అని ఆమెకు తెలుసు. అందుకే మరీ జాగ్రత్తగా ప్రవర్తిస్తోంది ఆమె.

"ఏం? నా కారు ఎక్కకూడదా?" అన్నాడు అంజిబాబు.

"ఎందుకు ఎక్కకూడదు? నువ్వేమయినా పరాయివాడివా?"

"మరయితే వచ్చి కూర్చో!" డోర్ ఓపెన్ చేశాడు అంజిబాబు, మైకంలో.

"అలా కాదు! నాన్నగారు నా గురించి వస్తారుకదా? ఇక్కడ నేను లేకపోతే బాధపడతారు."

"అయితే మీ నాన్నగారు వచ్చేవరకూ నీ దగ్గరే కూర్చుని సరదాగా కబుర్లు చెపుతాను" కారులోంచి కిందకు దిగబోయాడు అంజిబాబు.

వసుధ పై ప్రాణాలు పైనే పోయాయి. అతడు తనను మామూలుగా వదలడని గ్రహించింది. ఏదో చేసి అతడి నుండి తప్పించుకోవాలి....

డోర్ దగ్గరకు అడుగులు వేసింది. "ఎందుకు అంజి బాబూ నీకు అనవసరమైన శ్రమ? అందులోనూ, అందరూ మనల్నే చూస్తున్నారు. ఏం బావుంటుంది చెప్పు?" అంది సుతారంగా డోర్ మూస్తూ, వసుధ.

ఆ మాటలు అంజిబాబుమీద బాగానే పని చేశాయి. వసుధ బుగ్గమీద చిటిక వేసి కారు స్టార్టు చేశాడు. "బాయ్!" అంటూ ముందుకు పోనిచ్చాడు.

వసుధ బుగ్గను కంగారుగా తడుముకుంది. కోపంతో ఆమె మొహం కందగడ్డలా తయారయింది. కోపంతో ఆమె ఎద పొంగింది. అంజిబాబు వెళుతోన్న కారువైపు అసహ్యంగా చూసింది.

ఆమె గుండెల్లో రగులుతోన్న మంటలను ఆర్పటానికే అన్నట్లు భూషణంగారి కారు వచ్చి ఆమె ప్రక్కనే ఆగింది.

"ఏం డాడీ! ఇంత ఆలస్యం?"

"కొద్దిగా లేటయిందిరా! రా! కూర్చో" అన్నాడు భూషణంగారు. ఆయన వసుధ మొహంలో కనిపిస్తోన్న కోపపు రేఖలకు తన ఆలస్యమే అని భాష్యం చెప్పుకుని వూరుకుండిపోయాడు.

మరో పావుగంటలో కారు యింటికి చేరుకుంది. వసుధ కారు దిగి లోపలకు వెళ్ళింది. భూషణంగారు కారును గరేజ్ లో పెట్టి వచ్చారు.

టేబుల్ మీదున్న శుభలేఖనూ, దాంతో పాటు వున్న ఉత్తరాన్నీ చూసి ఎగిరి గంతేసింది వసుధ.

"ఏంట్రా! అంత హుషారుగా వున్నావు?" అడిగాడు భూషణం.

"అన్నయ్య పెళ్ళట!"

"ఎవరికి? గోపాలానికా?"

"అవును! పెదనాన్న మనల్ని వున్నపళంగా బయలు దేరి రమ్మని వ్రాశారు!"

"మొన్నే కదా గోపాలం వచ్చాడు! అప్పుడే పెళ్ళి ..."

"అంతా అలా జరిగిపోయిందట!" అంటూ, ఉత్తరాన్ని శుభలేఖనూ తండ్రి చేతిలో పెట్టి లోపలకు తుర్రుమంది వసుధ.

3

రామయ్య మాష్టారు పందిట్లో అటూ యిటూ తిరుగుతోన్నారు. ఆయనకు ఒకవైపు సంతోషంగానూ, మరోవైపు బాధగానూ వుంది. కానీ ఆయన మొహంలో అటు సంతోషంగానీ యిటు విచారంగానీ ఏ మాత్రం బయట పడటంలేదు. అన్నేళ్ళ జీవితంలో ఆయన సాధించగలిగింది అదే.

"ఏం మాష్టారూ? కులాసానా?"

తృళ్ళిపడి వెనక్కి తిరిగారు రామయ్యగారు.

ఎదురుగా సత్తిరాజు నవ్వుతూ నిలబడ్డాడు.

"నమస్కారం ఇన్స్పెక్టర్ గారూ!" మాష్టారు గొంతు వణికింది. ఎంత దాచుకుందామన్నా, ఆయన మొహంలోని కంగారు ఆయనలోని గాభరానూ బయట పెడుతూనే వుంది.

"మీరు పిలవకపోతే మాత్రం—ఈ వూళ్ళో జరిగే పెళ్ళికి నేను రాకుండా వుంటానా?" కుర్చీలో

కూర్చుంటూ, మాస్టారి మొహంలోకి చూశాడు సత్తిరాజు.

అతని అంతర్యాన్ని కనిపెట్టారు మాస్టారు. నిబ్బరం తెచ్చుకున్నారు. "మిమ్మల్ని పిలవటానికి నేనే స్వయంగా వద్దామనుకున్నా, కుదరలేదు. మరోలా భావించకండి" ఆయన మాటలు చాలా తాపీగా వున్నాయి.

మాస్టార్లో వచ్చిన ఈ మార్పును చూసి ఆశ్చర్య పోయాడు సత్తిరాజు. ఆశ్చర్యాన్ని కప్పిపుచ్చుకుంటూ చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

సత్తిరాజు వస్తాడని రామయ్యగారు యెప్పుడో వూహించారు. పెళ్ళికి వచ్చిన జనంలో కలిసిపోయిన పోలీసు మొహాలను ఆయన ఏనాడో గమనించాడు. ఆ విషయం సత్తిరాజుకు తెలియదు.

మరో పదినిముషాలు సత్తిరాజుతో మాట్లాడి లోపలకు వెళ్ళారు రామయ్య మాస్టారు.

లోపల పెళ్ళికూతురికి ముస్తాబు చేశారు ముత్తయిదువలు.

ఆకుపచ్చటి పట్టుచీర, ఎర్రటి పట్టు జాకెట్, మెళ్ళో వజ్రాల హారం, చేతులకు నాలుగేసి బంగారు గాజులు. వాటి మధ్య ఆకుపచ్చటి గాజు గాజులు, నెత్తిన పాపిట పింది, మొగలిరేకుల జడ—నయాపైసంత బొట్టు నుదుటిన మెరుస్తోంది. బుగ్గన నల్లటిచుక్క. భూలోకరంభలా వుంది దీప్తి.

ఆమెను ఒక్కనిముషం ఆప్యాయంగా చూశారు రామయ్య మాస్టారు.

హుషారుగా వుండాల్సిన ఆ పిల్ల కళ్ళలో నీళ్ళు నిలిచి

వున్నాయి.

రామయ్య మాస్టారు, నెమ్మదిగా దీప్తి దగ్గరకు నడిచారు. ఆమె కళ్ళు తుడిచారు. "పిచ్చిపిల్లా!" అంటూ జుత్తు సవరించారు.

అంతవరకు లోపల అణగారి వున్న దుఃఖం, దీప్తి గుండెల్లోంచి ఒక్కసారిగా పెల్లుబికింది.

"ఛ! ఏమిటిది?" అన్నారు మాస్టారు.

"నా వల్ల అన్నయ్య యిబ్బందుల్లో పడుతున్నాడు...."

"వాడికేం కాదమ్మా! వాడు అజేయుడు. వాడికి తెలియకుండా నీ పెళ్ళి జరిగిపోతే వాడు భరించగలడా? తెలిస్తే వూరుకోగలడా? వూరుకో. జరగాల్సింది జరక్కమానదు. అన్నిటికీ ఆ పైవాడే వున్నాడు."

"అదికాదు మాస్టారూ! ఆ ఇన్‌స్పెక్టర్...." అనబోతోంది దీప్తి. అంతలో తలుపు దగ్గర చప్పుడయింది. మాస్టారు ఆమెను మాట్లాడవద్దని సంజ్ఞ చేశారు. నెమ్మదిగా తలుపు దగ్గరకు వెళ్ళారు. మళ్ళీ ఏదో అనుమానం వచ్చి వెనక్కి వచ్చేశారు. దీప్తికి సంజ్ఞ చేశారు. దీప్తి మౌనంగా తలాడించి "అయితే అన్నయ్య రాడంటారా?" అంది బిగ్గరగా.

"ఎలా వస్తాడమ్మా? వాడికి నీ విషయం తెలియొద్దా?" అన్నారు రామయ్య మాస్టారు.

"అయితే ఎలా మాస్టారూ?"

"ఏం చేస్తాం తల్లీ? అంతా నీ దురదృష్టం. కనీసం వాడు ఎక్కడ వున్నాడో తెలిస్తే కబురో—కాకర కాయో—చేద్దుము. మనకి అదీ తెలియదాయె!" మరీ బిగ్గరగా అన్నారు రామయ్యగారు.

లోపలనుండి వినబడుతున్న మాటలను విన్నాడు— అప్పటివరకు తలుపుబయట నిలబడి వున్న కానిస్టేబుల్. సంతృప్తిగా తలాడించి—తను విన్నది చెప్పటానికి— ఇన్‌స్పెక్టర్ సత్తిరాజు దగ్గరకు వెళ్ళిపోయాడు.

తలుపు దగ్గరనుండి అడుగుల చప్పుడు దూరం అవటం గమనించారు రామయ్యగారు. చిన్నగా నవ్వుకుంటూ తలుపు దగ్గరకు వెళ్ళి తలుపుతీసి బయటకు చూశారు. బయట యెవ్వరూ లేరు.

"ఏమిటి మాస్టారూ! యిదంతా? ..." అని అడిగింది దీప్తి.

"ఎత్తుకు పై ఎత్తు" అన్నారు రామయ్యగారు.

"అన్నయ్యగారూ! పెళ్ళివారు వచ్చారు" అంటూ లోపలకు వచ్చింది తాయారమ్మ.

"సరే! నువ్వు లోపలి విషయాలు చూడమ్మా!" అంటూ పైకండువ సవరించుకుంటూ బయటకు వెళ్ళారు రామయ్యగారు.

తెల్లటి అంబాసిడర్ కారులోంచి హుందాగా దిగాడు గోపాలం. అతనితోపాటే దిగిన అందాల బొమ్మ మీద అందరి కళ్ళూ నిలిచిపోయాయి.

కారులోంచి దిగిన గోపాలం తల్లి "వసుధ! మా మరిదిగారి అమ్మాయి" అంటూ ఆ అమ్మాయిని అందరికీ పరిచయం చేస్తోంది.

రామయ్య మాస్టారు పెళ్ళివారికి స్వాగతం చెప్పారు.

పెళ్ళికొడుకుని మంగళస్నానికి తీసుకుని వెళ్ళారు.

వసుధ—కాబోయే వదినను పరిచయం చేసుకోటానికి లోపలకు వెళ్ళింది.

గడియారం ముళ్ళు పదకొండు గంటలను చూపిస్తోన్నాయి.

సత్తిరాజు పందిట్లో కాలుకాలిన పిల్లిలా తిరుగుతోన్నాడు. తన మనుషులను హుషారుపరుస్తోన్నాడు.

ముహూర్తం దగ్గరపడుతోంది. శివరావు వచ్చే సూచనలు ఎక్కడా కనపడటంలేదు. ఒకవేళ కానిస్టేబుల్ తెచ్చిన సమాచారం నిజమయినదే నేమో! అమ్మో! నమ్మటానికి వీలులేదు. ఆ మాస్టార్ని తక్కువగా అంచనా వెయ్యటానికి వీల్లేదు. తనకన్నా రెండాకులు యెక్కువే చదివాడు. తను అతడి ట్రిక్‌లో పడకూడదు—

అలా సాగుతోన్నాయి అతని ఆలోచనలు.

“అమ్మా! పెళ్ళికూతుర్ని తీసుకురండి!” అరిచాడు పురోహితుడు.

దీప్తిని పెద్ద బుట్టలో పెట్టి వంటబ్రాహ్మణులు తీసుకువచ్చారు. బుట్టమీద రామయ్యమాస్టారు చెయ్యి వేశారు.

పందిరంతా సన్నాయి వాయిద్యాలతో మారుమ్రోగిపోతోంది.

ఒక యువకుడు గబ గబా నడిచి లోపలకు వచ్చాడు.

సత్తిరాజు దృష్టి ఆ యువకుడిమీద పడింది. ఆ యువకుడు అది గమనించాడు. చటుక్కున అతని మెదడులో మెరుపులాంటి ఆలోచన మెరిసింది. పెళ్ళికొడుకు వెనకాల నిలబడిన వసుధ ప్రక్కకు వెళ్ళి నిలబడ్డాడు. నెమ్మదిగా ఆమెతో మాటలు కలిపాడు. వసుధ కూడా అతనితో నవ్వుతూ మాట్లాడుతోంది.

అప్పటివరకూ ఆ యువకుడినే గమనిస్తోన్న సత్తిరాజు

ఎప్పుడయితే వసుధ, అతనితో నవ్వుతూ మాట్లాడటం చూశాడో, మౌనంగా తల వూపి పందిట్లోని జనాన్ని చూడ్డంలో మునిగిపోయాడు.

సత్తిరాజు అటు తిరగ్గానే, ఆ యువకుడు రామయ్య మాస్టారి దగ్గరకు ఒక గెంతు గెంతాడు. మాస్టారి చెవులో యేదో చెప్పాడు. మాస్టారి మొహంలో కోటి కాంతులు వెలిగాయి. ఆయన ఆ యువకుడిని కృతజ్ఞతతో చూసి, నెమ్మదిగా పురోహితుడివైపు వెళ్ళారు. పురోహితుడితో ఒక్క నిముషం గుసగుస లాడారు. పురోహితుడు అంగీకారంగా తల వూపాడు.

సత్తిరాజు యిదంతా ఓరకంటితో చూస్తోన్నాడు.

రామయ్యమాస్టారు లోపలకు వెళ్ళారు.

మరో అయిదు నిముషాల తర్వాత అందరికీ డ్రింకులు అందాయి, అందరూ డ్రింకులను త్రాగుతోన్నారు. మాస్టారు డ్రింక్ బాటిల్‌ను తీసుకువచ్చి సత్తిరాజుకు అందించారు.

సత్తిరాజు నవ్వుతూ బాటిల్‌ను అందుకున్నాడు. కుర్చీలో కూర్చున్న మరో పెద్దమనిషికి అందించాడు.

మాస్టారు గతుక్కుమన్నారు. కాని ఆ గుర్పాటును బయటకు కనపడనీయకుండా కప్పిపుచ్చుకున్నారు. మరో బాటిల్ తీసి ఇన్‌స్పెక్టర్‌కు అందించి అక్కడ నుండి వెళ్ళిపోయారు.

ఆయన సత్తిరాజును అభినందించకుండా వుండలేక పోయారు.

సత్తిరాజు తను వూహించినదానికంటే తెలివయిన వాడు!

ఆయన గుండె వేగం హెచ్చింది.

సత్తిరాజు డ్రింకు తాగుతూ చుట్టూ చూశాడు.

తనవాళ్ళందరూ మాస్టారి ట్రిక్‌లో పడిపోయి వుంటారు. ఎత్తుమందు కలిపిన డ్రింకులను తాగి ఈపాటికి జోగుతూ వుంటారు.

సత్తిరాజు తన ప్రక్కన కూర్చున్న వ్యక్తికేసి చూశాడు.

ఆ వ్యక్తి మగతగా కళ్ళు మూసుకుంటున్నాడు.

ముందు అందించిన డ్రింక్ త్రాగితే తన పని కూడా యింతే అన్నమాట—అనుకున్నాడు సత్తిరాజు.

అంతలో ఆ ఇంటి ముందు చిన్న గుర్రబ్బండి ఆగింది. అందులోంచి ముగ్గురు వేదపండితులు క్రిందకు దిగారు. ముగ్గురూ చాలా హుందాగా పట్టుపంచలతో చేతికి కడియాలతో, నొత్తిన పిలకలతో, గురుభావం కలిగించేలా వున్నారు.

కల్యాణవేదికలో వున్న పురోహితుడు వాళ్ళను చూసి లేచాడు. "నమస్కారం ప్రభాకరశాస్త్రిగారూ! మీరు వస్తున్నారని యిప్పుడే తెలిసింది" అంటూ వాళ్ళదగ్గరకు అడుగులు వేశాడు.

రామయ్య మాస్టారు ప్రభాకరశాస్త్రి ముందుకు వచ్చాడు. "రండి! వధూవరులను ఆశీర్వదించండి!" అంటూ అక్షితలను ఆయన చేతిలో పోశారు.

ప్రభాకరశాస్త్రి అక్షితలు అందుకున్నాడు. ముందుకు అడుగు వేశాడు.

కొంచెం పొడుగ్గావున్న వేదపండితుడు చిరునవ్వు నవ్వి ముందుకు అడుగులు వేశాడు.

పెళ్ళికూతురు ముందుకు వచ్చి నిలబడ్డాను.

దీప్తి కళ్ళెత్తి ప్రభాకరశాస్త్రిని చూసింది. ఆమె

కళ్ళలో నీరు నిలిచింది. ప్రభాకరశాస్త్రి ఆమె నెత్తి మీద అక్షింతలు వేశాడు. మరికొన్ని అక్షింతలను గోపాలం నెత్తిమీద కూడా వేశాడు.

సత్తిరాజు అతని మొహాన్ని పరీక్షగా చూస్తున్నాడు. అతడి మొహంలో వస్తున్న మార్పులను జాగ్రత్తగా గమనిస్తున్నాడు.

రెండు నిముషాలు పోయాక సత్తిరాజు నెమ్మదిగా శాస్త్రి పక్కకు వచ్చాడు.

శాస్త్రి ఓరకంటితో సత్తిరాజును చూశాడు. ఎడమ చేత్తో తొడను కొట్టుకున్నాడు.

అదే అతని కొంప ముంచింది.

చేసిన తప్పును తెలుసుకుని నాలిక్కరచుకున్నాడు శాస్త్రి.

కానీ అప్పటికే ఆలస్యం అయిపోయింది.

శివరావు మానరిజమ్స్ గురించి పూర్తిగా తెలుసుకున్న సత్తిరాజు—ప్రభాకరశాస్త్రి ఎడమచేత్తో తొడను చరచుకోగానే, అతడు ప్రభాకరశాస్త్రి కాడనీ, ఆ వేషంలో వచ్చిన శివరావేననీ గ్రహించాడు. చటుక్కున జేబులో చెయ్యిపెట్టి పిస్టల్ బయటకు తీశాడు.

అది గమనించి శివరావు చటుక్కున ప్రక్కకు పురికాడు.

గోపాలం వెనుక నిలబడివున్న వసుధ పెళ్ళిపందిట్లోకి హఠాత్తుగా వచ్చిన మనిషిలో అంత కంగారు చూసి ఆశ్చర్యపోయింది.

"మిస్టర్ శివరావ్! లొంగిపో!" అంటూ అరిచాడు సత్తిరాజు.

శివరావు అతడి మాటలను లక్ష్యపెట్టలేదు. అంత

మంది మధ్యన సత్తిరాజు తనమీద పిస్తోలు వుపయోగించ లేడని శివరావు నమ్మకం.

సరిగ్గా సత్తిరాజు కూడా అదే విధంగా ఆలోచిస్తు న్నాడు.

తన చేతిలో వున్న ఆయుధాన్ని వుపయోగించటం కష్టం. అందుకే శివరావు అంత ధైర్యంగా వున్నాడు. ఏదో చేసి శివరావుని పట్టుకోవాలి—ఎలా?

అంతలోనే ఒక నిశ్చయానికి వచ్చాడు సత్తిరాజు. పందిట్లో వున్న జనాన్ని ఒక్కసారి పరికించి చూశాడు. "దయవుంచి ఎవరూ అటూ యిటూ పరుగెట్టకండి. ఎక్కడివాళ్ళు అక్కడ నేలమీద కూర్చుండిపొండి!" గట్టిగా అరిచాడు సత్తిరాజు.

అప్పటికే శివరావు విషయం అక్కడున్న వాళ్ళంద రికీ తెలిసిపోయింది.

ఒక్కొక్కరే సత్తిరాజు చెప్పిన ప్రకారం క్రింద కూర్చుండిపోవటం ఆరంభించారు.

శివరావుకు పాలిపోయింది. దిక్కుతోచనట్లుగా అని పించింది. సత్తిరాజు చెప్పినట్లు అందరూ నేలమీద కూర్చుండిపోతే తనపని సరి. తను దొరికిపోవటం ఖాయం. అలా జరగడానికి వీలులేదు. ఏదో చేసి అక్కడ నుండి తప్పించుకోవాలి. ఎలా? అంతలోనే వేదికదగ్గర వయ్యా రంగా నిలబడ్డ వసుధమీద అతని చూపు నిలిచింది. వెంటనే అతడి మెదడులో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది.

పండితుడు వేషంలో వచ్చింది శివరావు అని తెలియ గానే వసుధ దవడ కండరాలు బిగుసుకున్నాయి. ఒక్క నిముషం ఆశ్చర్యంతో నిశ్చేష్టురాలయింది. వెంటనే

స్వృహాలోకి వచ్చింది. ఫ్లాష్ లో కాలేజీలో ప్రిన్సి పాల్ చెప్పిన మాటలు ఆమెకు గుర్తుకు వచ్చాయి. ఆమె రక్తం కణోష్ణమయింది. కోపంగా బిగించింది. ఎలాగయినా శివరావును పట్టుకోవాలి. ఆలోచిస్తూ ముందుకు చూసింది.

శివరావు తనవైపు వస్తూ కనిపించాడు. ఆమెకు శివ రావు మనసులోని అభిప్రాయం తెలియదు. ఆమె కోంగు బిగించి శివరావును పరికించి చూస్తోంది. ఆమె శివరావుని అటకాయించి ఇన్ స్పెక్టర్ సత్తిరాజుకు అప్పగించాలను కుంది.

అంతలోనే శివరావు అమాంతం ముందుకు దూకాడు. వసుధను చేతుల్లో యిరికించుకున్నాడు. పిస్తోలును ఆమె కణతకు గురిపెట్టాడు. "ఎవరూ ముందుకు రావటానికి సాహసించకండి. అనవసరంగా ఈ పిల్ల ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోతాయి" శివరావు గొంతు పెళ్ళి పందిట్లో ఖంగుమంది.

వసుధ ఒక్క నిముషం వూపిరి తీసుకోవటం మర్చి పోయింది. అప్పటివరకూ ఆమెలో వున్న తెగువ మటు మాయమయిపోయింది.

పెళ్ళిపందిర్లో వున్నవాళ్ళందరూ ప్రేక్షకులుగా మారిపోయారు.

సత్తిరాజు పళ్ళు బిగపట్టాడు: తను అనవసరంగా ఒక ఆడపిల్లను యిందులో యిరికించానేమో అన్న బాధ అతడిని నిలువెల్లా తినేస్తోంది. అతని కళ్ళు కోపంతో ఎరుపెక్కాయి. తన అనుచరులందర్నీ ఒక్కసారి చూసి శివరావువైపు తిరిగాడు. "శివరావ్! మర్యాదగా లొంగిపో! ఇప్పటికే నువ్వు చేసిన నేరాలు చాలా

వున్నాయి. మళ్ళీ యిప్పుడో కొత్త నేరం చెయ్యకు' కమాన్! నీకు శిక్ష తగ్గ యేర్పాటు చేస్తాను" అంటూ అరిచాడు.

శివరావు ఇన్ స్పెక్టర్ మాటలను లెక్కపెట్టలేదు. వసుధను బలవంతంగా నెట్టుకుంటూ ముందుకు సాగి పోయాడు. అందరూ అడ్డు తప్పుకొని అతడికి బయటకు వెళ్ళటానికి దారి యిచ్చారు. శివరావు గుమ్మం దగ్గర ఆగాడు. ఒక్కసారి మళ్ళీ వెనక్కు తిరిగిచూశాడు. "నన్ను ఎవరూ వెంబడించటానికి ప్రయత్నం చెయ్యొద్దు" అనేసి బండి ఎక్కాడు.

మరుక్షణం బండి ముందుకు వురికింది.

4

అదో చిన్న కొండగుహ.

గుహ ద్వారంవద్ద దట్టంగా పెరిగిన చెట్లవలన గుహ లోపలిభాగంలోకి అంతగా వెలుతురు రావటంలేదు. బాగా పరీక్షగా చూస్తేగాని అక్కడో గుహ వుందని మానవమాత్రు డెవడూ పసిగట్టలేడు.

గుహ బయట నిలబడి ఓసారి చుట్టూ పరికించి చూశాడు శివరావు. మోటారుసైకిల్ ను తోసుకుంటూ లోపలకు వెళ్ళాడు.

గుహలోపల ఒక ప్రక్కగా బులెట్ కు స్టాండ్ వేశాడు.

చాలా పెద్ద గుహ అది. కొండలో ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన తొర్ర. ప్రవేశప్రాంతం సన్నగా వుండి లోపలకు వెళ్ళేకొద్దీ చాలా వెడల్పుగా వుంది.

శివరావు పూర్తిగా లోపలకు వచ్చేశాడు. ఉండ

టానికి వీలుగా గుహాలోపల అతడు ఒక చక్కటి మంది గాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. చిన్న మోటారు సహాయంతో ఎలక్ట్రిక్ సప్లయ్‌ని యేర్పాటు చేసుకున్నాడు. గాస్ స్టవ్, ఫ్రిజ్, సంసారానికి కావలసిన యితర సామాన్లు యేర్పాటు చేసుకున్నాడు. కాలు బయట పెట్టకుండా కనీసం నెలరోజులయినా ఆ గుహాలో హాయిగా గడపవచ్చు.

గుహాలోపల చివరగా ఏర్పాటు చేసిన నలుచదురపు పాలరాతిమీద కూర్చుని ఉంది వసుధ. ట్యూబ్ లైట్ కాంతిలో ఆమె శరీరం పాలరాయిలా మెరుస్తోంది.

శివరావు ఆమెను ఒక్కక్షణం పరిశీలనగా చూశాడు.

ఆమె శివరావును చూసి మొహం అటుప్రక్కకు తిప్పుకుంది.

శివరావు టేబుల్ వైపు చూశాడు. ఆమెకోసం అక్కడ ఉంచిన ఆహారపదార్థాలన్నీ అలానే ఉన్నాయి. శివరావు మనసు గతుక్కుమంది.

"భోజనం చెయ్యలేదా?" అడిగాడు శివరావు.

వసుధ మాట్లాడలేదు.

శివరావు ఆమె ముందుకు నడిచాడు. "ప్లీజ్ భోజనం చెయ్యండి!" అన్నాడు.

వసుధ అక్కడకు వచ్చి మూడురోజులయింది. అప్పటి నుండీ పచ్చి మంచినీళ్ళయినా ముట్టుకోలేదు. చాలా నీరసంగా ఉంది. శివరావుకు ఆమెను చూస్తే జాలివేసింది. తన చేతిలో ఉన్న పేకెట్‌ను వసుధమీదకు విసిరాడు. "దీనిలో, చీరలు, బ్లవ్‌జులు ఉన్నాయి" అనిని గాస్ స్టవ్ దగ్గరకు వెళ్ళాడు. వంటపనిలో మునిగిపోయాడు.

వసుధకు యేడుపు ముంచుకు వచ్చేస్తోంది. కానీ ఏం

చెయ్యగలదు. తనో అబల. పోనీ శివరావు బయటకు వెళ్ళగానే పారిపోదాం అంటే, అది జరగని పని. శివరావు బయటకు వెళ్ళేముందు గుహాద్వారం దగ్గర ఎలక్ట్రిక్ సర్క్యూట్ ఆన్ చేసి వెళ్ళిపోతున్నాడు. ఆ సర్క్యూట్ దాటి బయటకు వెళ్ళటం చాలా కష్టం. దానికీ లోపల పనిచేసే మోటారుకు యేమీ సంబంధంలేదు.

గుహకు వచ్చిన కొత్తలో బయటకు వెళ్ళటానికి ప్రయత్నంచేసి మరీ విఫలమయింది. అప్పటినుండీ శివరావు మరీ జాగ్రత్తగా వుంటున్నాడు. అతని మనసు లోని వుద్దేశ్యం కూడా సరిగా అర్థంకావటంలేదు.

వసుధ నీరసంగా మంచంమీద వాలిపోయింది.

సింక్ దగ్గర శివరావు గిన్నెలు సర్దుతున్నాడు.

పదినిముషాలు పోయాక అతడు ఆమె దగ్గరకు వచ్చాడు. "నేను బయటకు వెళుతున్నాను. తిరిగి యిక్కడకు రావటానికి ఆలస్యం కావచ్చు. టేబుల్ మీద భోజనం రెడీగా వుంది. చల్లారిపోకుండా భోజనం చేసి విశ్రాంతి తీసుకోండి" అంటూ మోటారుసైకిల్ వైపు అడుగులు వేశాడు.

"ఆగండి!" అరిచింది వసుధ.

శివరావు వెనక్కి తిరిగాడు. "ఏం?" అన్నాడు. గుహలోకి వచ్చాక మొదటిసారిగా వసుధ పెదవి విప్పింది.

"నన్ను యెందుకు బంధించారు....?" అడిగింది వసుధ.

"నన్ను నేను కాపాడుకోవటానికి!"

"అందుకు ఆడదానిని నేనే దొరికానా?"

"సారీ! తప్పలేదు! నేను ఎంతో బాధపడుతున్నాను"

అతడి మాటల్లో సంస్కారం వుంది.

"మీరు సత్తిరాజు నుండి తప్పించుకోవటానికి నన్ను అడ్డం పెట్టుకొన్నారు. మీ పని అయిపోయింది కదా? ఏ దురుద్దేశం లేకపోతే మీరు నన్ను యెందుకు బంధించి వుంచుతారు?"

"నన్ను వెంబడించవద్దు—అంటే వినకుండా సత్తిరాజు నా వెంట పడ్డాడు. మిమ్మల్ని యిక్కడకు తీసుకరాక తప్పలేదు. ఇప్పుడు మీకు నా ప్లాను గురించి పూర్తిగా తెలుసు. మిమ్మల్ని బయటకు వదిలితే చాలా ప్రమాదం."

"అయితే నా బ్రతుకు యిక్కడే తెల్లారిపోవాలా?" వసుధకు యేడుపు ముంచుకొస్తోంది.

"అక్కర్లేదు! నేను మరో ప్లాను వేస్తున్నాను. ఆ పని పూర్తికాగానే మిమ్మల్ని వదిలేస్తాను!" అని యిక ఆమె మాట వినకుండా బైట తాళం వేశాడు.

వసుధ రెండు నిముషాలు అతడు వెళ్ళినవైపే చూస్తూ వుండిపోయింది.

నెమ్మదిగా మంచంమీద నుండి లేచింది. ఒళ్ళు విరుచుకుంది. టేబుల్ మీద వున్న ఆహారపదార్థాలను చూడగానే ఆమెకు ఆకలి గుర్తుకు వచ్చింది. ఆవురావురంటూ భోజనం చేసింది. కంట్లోకి శక్తికిరణాలు ప్రవేశించాయి. ఒళ్ళంతా మకిలి పట్టివుంది. బాత్ రూమ్ వెళ్ళి తలారా స్నానం చేసింది.

శివరావు తెచ్చిన బట్టలపాకెట్ తెరిచింది. పేకెట్ లో నాలుగు చీరలు, నాలుగు బ్లవుజులూ వున్నాయి. నాలుగూ చక్కటి రంగులు. అందులో తనకు యిష్టమైన సంపెంగ రంగు చీర, మేచింగ్ బ్లవ్ జూ తీసి వేసుకుంది.

మంచంమీద కూర్చుని ఆలోచనల్లో మునిగిపోయింది.

తనని యిప్పటి వరకూ శివరావు మర్యాదగానే చూశాడు. ఎంతైనా మొగాడు. ఒంటరిగా తను ఒక మగవాడి దగ్గర....అతనుమటుకు ఎంతకాలం నిగ్రహంగా వుండగలడు. అందులోనూ పచ్చి రౌడీ, హంతకుడు....తను ఇక్కడనుండి తప్పించుకుతీరాలి....ఎలా?.... ఎలా?....

రెండు నిముషాలు కళ్ళు మూసుకుని కూర్చుంది వసుధ....

ఆమెకు ఒక ఆలోచన స్ఫురించింది.

నెమ్మదిగా లేచి గుహంతా వెతికింది. చిన్న పెన్సిల్ ముక్క దొరికింది. బట్టల పేకెట్ లోపల వున్న రేపర్ తీసింది. తనను యిక్కడకు తీసుకువచ్చినపుడు దారంతటిని క్లుప్తంగా గుర్తు పెట్టుకుంది. నెమ్మదిగా రేపర్ మీద తను వున్న గుహ ఎక్కడో స్కెచ్ గీసింది. తన గురించి స్పష్టంగా వ్రాసింది. రేపర్‌ను మడచి తను విడిచిన చీర కొంగుకు ముడివేసింది. పథకాన్ని మరోసారి నెమరువేసుకుంది. శివరావు గురించి తయారుగా కాసుక్కూర్చుంది.

చీకటి పడుతోందనగా శివరావు వచ్చాడు. మనిషి చాలా అలసటగా వున్నాడు. కానీ ఆ అలసట అంతా లోపల తను తెచ్చిన చీర కట్టుకుని కూర్చున్న వసుధను చూడగానే మటుమాయమయ్యింది. "గుడ్! భోజనం కూడా చేశారన్న మాట! థాంక్యూ!" అన్నాడు.

వసుధ అతడిని ఆశ్చర్యంగా చూసింది. "థాంక్స్ దేనికి?" అంది.

"మిమ్మల్ని నేను యిక్కడికి బలవంతంగా తీసుకు వచ్చాను. మీరు తిండీ నిద్రా మాని కూర్చుంటే మా

కేదయినా జరిగితే ఆ పాపం నాకు చుట్టుకుంటుంది కదా! నన్ను ఆ పాపానికి గురి కాకుండా రక్షించారు. అదీ కాకుండా నా మాట మన్నించి నేను తెచ్చిన చీర కట్టుకున్నారు" అంటూ వసుధ వైపు చూశాడు.

వసుధ అతడిని విచిత్రంగా చూసింది. ఏమిటీ మనిషి- ఇతడికి కూడా పాపభీతి, దైవచింతన వుందా?—అయితే మరి హంతకుడుగా యెందుకు మారాడు?—కారణం తెలుసుకోవాలనిపించింది వసుధకు. అంతలోనే మనసు మార్చుకుంది—అమ్మో అతడి మాటల ధోరణిని బట్టి అతడిని ఒక మంచిమనిషిగా అంచనా వేసి అతడి మోసంలో పడకూడదు. అందుకే తన పథకాన్ని అమలు జరపాలనే నిశ్చయానికి వచ్చేసింది. "మిస్టర్ శివరావ్?" అంది ఎంతో సౌమ్యంగా!

ఆమె అంత సౌమ్యంగా మాట్లాడటం శివరావును ఆశ్చర్యపరచింది. అయినా ఆశ్చర్యాన్ని లోపలే అణచుకొని "యస్! ప్లీజ్!" అన్నాడు.

"నాకు యిక్కడ చాలా బోర్ గా వుంది! ఒక్కసారి అలా బయటకు తీసుకువెళ్ళండి" అంది.

శివరావు మాట్లాడలేదు.

"పోనీ లెండి! మీకు యిబ్బంది అయితే వద్దు లెండి" అంది.

"అబ్బే! యిబ్బంది—అని కాదు—చీకటి పడి పోయింది కదా! రాత్రి వేళ యేం బయటకు వెళతాం లెండి! రేపు ఉదయం వెళదాం!" అన్నాడు.

"పగలు యెందుకు లెండి! రాత్రయితే మనల్ని ఎవరు చూడరు."

శివరావు కాదనలేక పోయాడు. "సరే రండి!"

అన్నాడు.

"ఇలా గేనా? ముందు మీరు స్నానం చేసి రండి!" అంది.

శివరావు తల వూపి బాత్ రూమ్‌లోకి వెళ్ళాడు.

అతడు అలా వెళ్ళగానే, వసుధ నెమ్మదిగా లేచి, తను విడిచిన చీరలో చిన్న పీలికను చింపింది. ఆ పీలిక చివరే తను స్కెచ్ గీచిన పేపరు వుంది. ఆ పీలికను చిన్నగా మడచి బ్లౌజ్‌లో దాచేసింది.

ఈలోగా స్నానం ముగించుకొని శివరావు బయటకు వచ్చాడు.

వసుధ లేని ఆప్యాయతను తెచ్చిపెట్టుకొని అతడితో మాట్లాడటం ఆరంభించింది.

మరో పావుగంటలో యిద్దరూ గుహ వదలి బయట పడ్డారు.

5

"మీరు అతడిని పట్టుకోక పోగా ఒక అమాయకు రాల్ని అతడిపాలు చేశారు! ఛ! వాటెషేమ్ టు అవర్ డిపార్టుమెంట్" అసహనంగా నుదురు రుద్దుకున్నారు కమీషనర్ శ్రీపతి.

సత్తిరాజు సర్వీస్‌లో జాయిన్ అయినాక మొట్ట మొదటిసారిగా పై అధికార్ల చేత చీవాట్లు కాస్తున్నాడు. అతడి అహం దెబ్బతింది. కానీ పై అధికార్లను యేమీ అనలేని అసహాయత. అందులోనూ, తన సర్కిల్ కమీష నర్ జ్యూరిస్‌డిక్షన్ లోనిది కాదు. అయినా శ్రీపతి తన మీద అధికారం చెలాయిస్తుంటే యేమీ చెయ్యలేక మౌనంగా ఉండిపోయాడు. కానీ పై అధికార్ల మీద తన కున్న కోపం శివరావు పట్ల కసిగా మారిపోయింది.

"వాట్ మిస్టర్ రాజా! ఏం మాట్లాడకుండా బెల్లం కొట్టిన రాయిలా నిలబడిపోయావ్?" కమీషనర్ గొంతు ఉరిమింది.

సత్తిరాజు సర్దుకున్నాడు. "సారీ సార్! వాడిని తప్పకుండా పట్టుకుతీరతాను సార్! నన్ను నమ్మండి! ఇట్స్ ఛాలెంజ్ టు మి!" అన్నాడు.

"ఎస్! ఎస్! మీమీద నాకు నమ్మకం వుంది. శివరావు తనతో తీసుకువెళ్ళిన అమ్మాయి తండ్రి భూషణం నాకు క్లోజ్! అందుకే నేను రంగంలోకి దిగాల్సివచ్చింది. మరోలా భావించకండి."

"ఎంత మాట సర్! ఇట్స్ ప్లజర్ టు మి!"

"డన్! గో ఎ హెడ్." అన్నాడు శ్రీపతి.

"యస్! సర్!" అంటూ అతనికి సెల్యూట్ చేసి బయటకు వచ్చేశాడు ఇన్స్పెక్టర్ సత్తిరాజు.

బయట అతనికోసమే కాచుకొని వున్న జీప్ —అతను ఎక్కగానే ముందుకు ఉరికింది.

సత్తిరాజు జీపులో కూర్చుని కళ్ళు మూసుకొన్నాడు. డ్రైవర్ మాట్లాడకుండా జీపు నడుపుతున్నాడు.

"టాంక్ నిండా డీసెల్ వుందా?" అడిగాడు సత్తిరాజు.

"ఉంది సార్!"

"రెండు ఫుల్ టిన్స్ కొట్టించి జీపులో పెట్టు!"

డ్రైవర్ జీపును పెట్రోల్ బంకు దగ్గర ఆపాడు. జీపు వెనక్కు వెళ్ళి రెండు టిన్నులు తీసి వాటినిండా ఆయిల్ కొట్టించి జీపులో పెట్టాడు. సత్తిరాజు జేబులోంచి పర్సు తీసి బిల్ చెల్లించాడు. "స్టేషన్ కు పోనీ!" అన్నాడు.

జీపు స్టార్టయ్యింది. మరో పావుగంటలో జీపు స్టేషన్

ముందు ఆగింది.

సత్తిరాజు కానిస్టేబుల్స్‌ను పిలిచాడు. "మనం వెంటనే నల్లమల్లై ఫారెస్టుకు బయలుదేరి వెళ్ళాలి" అన్నాడు.

కానిస్టేబుల్స్‌కు గుండెల్లో రాయి పడింది. "ఇదెక్కడి తద్దినంరా!" అనుకొన్నారు.

సత్తిరాజు వాళ్ళ మనోభావాలను కనిపెట్టాడు. "మనం చేసే ఉద్యోగం అలాంటిది. మనం కత్తిమీద సాము చెయ్యక తప్పదు. ఇప్పుడు మన పరువుకు దెబ్బ తగలబోతోంది. ఇంతవరకు మనం సంపాదించుకొన్న పరువంతా మంటగలిసి పోతోంది. ఆ శివరావుగాడు మన కళ్ళల్లో దుమ్ముకొట్టి పారిపోయాడు. మనం వెంటనే వాడిని పట్టుకోకపోతే మనం యింక డిపార్టుమెంటులోని మిగతా వాళ్ళ ముందు తలెత్తుకు మసలలేము. మీరు రానంటే నే నొక్కడినే బయలుదేరుతాను" అన్నాడు.

సత్తిరాజు మహా మొండిమనిషి. ఒకటి అనుకొన్నాడంటే—అది జరిగేదాకా నిద్రపోడు. ఆ విషయం కానిస్టేబుల్స్‌కు బాగా తెలుసు. అందుకే యింకేమీ మాట్లాడకుండా ఆయనతో బయలుదేరటానికి ఒప్పుకొన్నారు.

సత్తిరాజు యింటికి ఫోన్ చేసి తనకు నాలుగురోజుల వరకు రావటం కుదరదని చెప్పాడు.

సాయంత్రం నాలుగవుతోందనగా జీపు కానిస్టేబుల్స్‌నీ, సత్తిరాజునీ తీసుకుని బయలుదేరింది.

సత్తిరాజు ముందు సీట్లో కూర్చుని శివరావు తాలూకు ఫైలు చూస్తోన్నాడు. ఫైలులోని కాగితాలు తిరుగుతోంటే అతని గుండె భారంగా తయారయిపోతోంది.

అంత మంచి కుర్రవాడు, ఒక దొంగగా తయారయ్యాడంటే, పూర్తిగా యీ సమాజానిదే బాధ్యత—కాదని యెవరూ అనరు. అంతమాత్రాన తను ఒక దొంగమీద జాలి చూపలేదు. వ్యక్తిగతం వేరు—ఉద్యోగ ధర్మం వేరు — ఉద్యోగ ధర్మానికే ఎక్కువ ప్రాధాన్యత నిస్తాడు తను. డ్యూటీ కోసం ప్రాణాన్నయినా యిస్తాడు.

జీపు గంటకు అరవై మైళ్ళ వేగంతో పోతోంది. జీపులోనికి చల్లని గాలి రివ్వుమని వీస్తోంది. సత్తిరాజు ఫైలును మూసి, నెమ్మదిగా కళ్ళు మూసుకున్నాడు.

6

వసుధ కేరింతలు కొడుతూ ఆ ప్రాంతాన్నంతటినీ కలయతిరుగుతోంది. చిన్నపిల్లలా గెంతులు వేస్తోంది. శివరావు ఆమెను విచిత్రంగా చూస్తోన్నాడు.

ఎందుకో అతను కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఇంత అమాయకురాలినా, తాను చెరపట్టింది—ఒకవేళ తను వదిలినా బయటకు వెళ్ళి తలెత్తుకు తిరగగలదా? ఆమెకు పెళ్ళవుతుందా?—ఆమె జీవితాన్ని తాను నాశనం చెయ్యలేదు కదా?

"క్షమించు భగవాన్—నన్ను క్షమించు" శివరావు కళ్ళు మూసుకున్నాడు.

వసుధ నెమ్మదిగా తన జాకెట్లో దాచుకొన్న గుడ్డ పేలికను బయటకు తీసింది. శివరావు దగ్గరకు వచ్చి "ఒక సారి మీరు అలా దూరంగా వెళ్ళండి" అంది సిగ్గు పడుతూ.

శివరావు ఏమనుకొన్నాడో ఏమో తల వంచుకొని దూరంగా వెళ్ళాడు.

అతను వెళ్ళిన వెంటనే వసుధ కొండవాలుకి వచ్చింది. కొండ అంచున ఆనుకొని వలయుంగా నల్లని తారు రోడ్డు పరచుకొని వుంది. వసుధ ఆ రోడ్డువైపు ఒక్కసారి చూసింది. రోడ్డువయిపుకు బాగా క్రిందకు వంగి వుంది ఓ చెట్టు.

వసుధ నెమ్మదిగా ఆ చెట్టును ఎక్కడం ఆరంభించింది. కిందకు చూస్తే కళ్ళు తిరుగుతోన్నాయి. ధైర్యం తెచ్చుకుంది వసుధ. తన చేతిలో వున్న చీర చెరగుకు ఓ చెట్టుకొమ్మని బిగించింది. చెరగు రెండో చివరను చెట్టు కొమ్మకు ముడి వేసింది. వేసింది. రెండో చెరగుకు కట్టిన కొమ్మవలన చీర చెరగు క్రిందకు వేలాడుతోంది.

వసుధ నెమ్మదిగా చెట్టు దిగి క్రింద నిలబడింది. తను చెట్టుకు కట్టిన చీర చెరగు రోడ్డున పోయేవాళ్ళకు తప్పక కనిపిస్తుంది. వసుధ హాయిగా వూపిరి పీల్చింది.

శివరావు మరో రెండు నిముషాలలో అక్కడకు వచ్చాడు.

"ఇంకా ముందుకు వెళదామా?" అన్నాడు.

"అవసరంలేదు. వెనక్కి వెళ్ళిపోదాం!" అంది వసుధ.

శివరావు ఆమెను విచిత్రంగా చూశాడు. "అదేమిటి! అడవంతా చూద్దామన్నారుగా? అప్పుడే వెనక్కి వెళ్ళి పోదాం—అంటారేమిటి?" అన్నాడు.

వసుధ చిన్నగా నవ్వింది. నిండు పున్నమి కాంతిలో ఆమె మొహం వింతగా మెరిసిపోతోంది. "ఏం చూస్తాం? ఎక్కడ చూసినా ఒకటేగా? అంతా అడవేగా? ఇంక చూడ బుద్ధి కావటంలేదు" అంది.

ఇద్దరూ నడుస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

మాటల సందర్భంలో వసుధ అతన్ని గూర్చి తెలుసుకోవాలనే కుతూహలాన్ని బయట పెట్టింది.

శివరావు చిన్నగా నవ్వి వూరుకున్నాడు. ఇద్దరూ హోండా హీరోపై గువాక బయలుదేరారు. "ఎవరూ పుట్టగానే దొంగ కారు. పరిస్థితుల ప్రభావంవలన మనుషులు దొంగలుగా మారుతారు. ప్రతీ దొంగ వెనకా, హంతకుడి వెనకా, గూండా వెనుకా ఏదో ఒక చరిత్ర వుంటుంది. సమాజం మంచివాళ్ళతో పాటు చెడ్డవాళ్ళను కూడా తయారుచేస్తూ వుంటుంది. మీరు యిలా మారటానికి కారణం యేమిటో చెబుతారా?" అంది.

శివరావు మొహం కందగడ్డలా మారిపోయింది. పళ్ళు పటపటా కొరికాడు. అంతలోనే తేరుకొని, మామూలు మనిషయ్యాడు. ఆవేశాన్ని లోపలే అణగదొక్కుకొన్నాడు. "క్షమించండి. నా గత చరిత్రను చెప్పి మిమ్మల్ని బాధ పెట్టను" అన్నాడు.

వసుధ అతడిని జాలిగా చూసింది. "పర్వాలేదు చెప్పండి. మనసులో వున్న బాధను యెవరితోనో ఒకరితో చెప్పుకోవాలి. లేకపోతే గుండె బద్దలయిపోతుంది" అంది.

"ఫర్వాలేదు. ఇప్పుడు నా గుండె పగిలిపోయినా, నాకు బాధలేదు. నా చెల్లెలి పెళ్ళి జరిగిపోయింది. నాకిక నిశ్చింత. ఇంతకాలం నేను పడిన కష్టాలకు ఓ అర్థం కనిపించింది. ఇక నాకే బాధా లేదు."

"అయితే మీరు యింతకాలం కష్టపడింది మీ చెల్లెలి గురించా?"

"అవును. నేను చేసింది, చేస్తోన్నదీ తప్పని తెలుసు-కానీ నా చెల్లెలు అందరి ఆడవాళ్ళలా మంచి మొగుడితో

కాపురం చెయ్యాలని కలలు గన్నాను. ఇంత కాలానికి ఆ కలలు నిజం అయ్యాయి."

వసుధ యేదో అనబోయింది. అంతలోనే తమా యించుకుంది. "మీ గతం చెప్పండి" అంది.

"సరే! మీరు అంతగా అడుగుతున్నారు కాబట్టి తప్పే దేముంది?" అని చెప్పడం మొదలు పెట్టాడు శివ రావు.

7

గలగల పారే గోదారి మధ్యన వున్న చిన్న కుగ్రామం తిర్ళకుప్ప.

అన్నం పున్నం తెలీని అమాయకులు—ఒకరికోసం ఒకరు బ్రతికే ప్రజల సముదాయం ఆ గ్రామం—ఒక వయిపు ఎత్తుగా పెరిగిన కొబ్బరి తోటలూ, పండ్ల చెట్లూ, మరో వయిపు పచ్చటి తివాచీలలా పెరిగిన వరిచేలూ.... ఆ గ్రామానికి వింత అందాలు కూరుస్తోన్నాయి.

ఆ గ్రామంలో చిన్నపిల్లలకోసం ఒక స్కూల్ వున్న దేకానీ, దక్కతిలేదు స్కూల్ కు బిల్డింగ్ లేదు. ఒక పూరిపాక. దాంట్లో ప్రెసిడెంట్ గారి గొడ్లను కడు తోంటాగు. అటు పిల్లలకు గానీ, యిటు వారి తల్లిదండ్రు లకు గానీ, చదువంటే యిష్టంలేదు.

అటువంటి పరిస్థితులలో నారాయణరావుగారు ఆ ఊరి మాస్టరుగా వచ్చారు.

ఆయన వచ్చిన దగ్గరనుండీ ఆ ఊరి పరిస్థితే మారి పోయింది స్కూల్ చక్కబడింది. పిల్లలకు చదువు మీద శ్రద్ధ పెరిగింది.

నారాయణరావుగారు ఆ ఊళ్ళోని అందరి తలల్లోనూ నాలుకగా మారిపోయారు. ఆ గ్రామ సర్పంచ్ తో

సమానంగా పలుకుబడి సంపాదించుకున్నారు.

ప్రతి గ్రామంలో లాగానే ఆ ఊళ్లో కూడా నాయుడని ఓ రావణాసురుడు వున్నాడు. అతడు పైకి మాత్రం యెంతో మంచిగా ఉండేవాడు. తనకున్న రాజకీయ చతురతతో ఆ ప్రాంతానికి ఎమ్. ఎల్. ఏ. అయ్యాడు.

నారాయణరావుగారి భార్య తాయారమ్మ. నలభై యేళ్ళ పడిలో పడినా ఇరవై ఏళ్ళ పడుచులా ఉండేది ఆమె. నాయుడిగారు కన్ను ఆమెమీద పడింది. తరచూ ఆ యింటికి వచ్చిపోతూండేవాడు అతని మనస్సులోని దురుద్దేశాన్ని గ్రహించని మాష్టారు దంపతులు, యింటికి వచ్చినప్పుడల్లా అతనికి సకల మర్యాదలూ చేసే వారు.

మాష్టారుకు యిద్దరు పిల్లలు.

పెద్దవాడు శివరావు, టౌన్‌లో వున్న విక్టోరియా కాలేజీలో చదువు పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. చాలా తెలివైనవాడూ, చురుకైనవాడూను. ఐ.ఎ.ఎస్‌కు కృషి చేద్దాం—అనుకున్నాడు.

రెండోది అమ్మాయి. దీప్తి—చలాకీ అయిన పిల్ల.

ఆ రోజు మాష్టారి కుటుంబం చెల్లాచెదరయిపోయిన రోజు. శివరావు జీవితాన్నే మార్చేసిన రోజు— శ్రీరామనవమి.

తిళ్ళకుప్పలో శ్రీరామనవమి — అంటే ఆ చుట్టు ప్రక్కల గ్రామాలకే పండగ. నవరాత్రులు చాలా హడావుడిగా జరుగుతోన్నాయి.

నవమిరోజు సినీమా నటులచే నాటకం అరేంజి చేశారు. నవరాత్రులకు శివరావే అధ్వర్యం వహించాడు.

పందిరంతా కలయ తిరుగుతున్నాడు. కొడుకు చలాకీ తనానికి మురిసిపోయి నారాయణరావుగారు అతడికి చిన్న చిన్న పనుల్లో సాయపడుతున్నారు.

రాత్రి ఎనిమిది గంటలయింది.

"ఒరేయ్ భోజనం చేద్దాం రారా! మళ్ళీ అతిథులు వచ్చేస్తే నీకు కుదరదు" అన్నాడు నారాయణరావు కొడుకును ఉద్దేశించి.

"మీరు వెళ్ళండి నాన్నా. యిక్కడ ఎవరో ఒకరు ఉండాలి. లేకపోతే బావోదు. రామయ్య మాస్టారు వస్తానన్నారు. ఆయన వస్తే నేను వస్తాను. లేకపోతే మీరు వచ్చాక వస్తాను" అన్నాడు.

నారాయణరావుగారు తలవూపి వెళ్ళిపోయారు.

అంతలో రామయ్య మాస్టారు అక్కడకు వచ్చారు. ఆయన ఆ ప్రక్క ఊళ్ళో వున్న స్కూల్లో పనిచేస్తున్నారు. నారాయణరావుగారి ఆప్తమిత్రుడు. "ఏరా! శివూ యింకా యింటికి వెళ్ళలేదా!" అన్నాడాయన వస్తూనే.

"లేదు. మాస్టారూ! మీరు వస్తే వెళదామని."

"సరే వెళ్ళు!"

శివరావు యింటికి బయలుదేరాడు. శివరావు చిన్నతనంనుండీ రామయ్య మాస్టారి దగ్గరే చదువుకున్నాడు. అందుకు అతనికి, ఆయనంటే ఎనలేని గౌరవం. ఆయనకు కూడా శిష్యుడంటే వల్లమానిన అభిమానం. ఆ గురు శిష్య అనుబంధం అనిర్వచనీయం.

గ్రామం అంతా చీకటిగా వుంది.

నారాయణరావుగారి ఇల్లు ఊరుకి ఉత్తరంగా వున్న కొబ్బరి తోటలో వుంది.

శివరావు ఏటిగట్టుమీంచి నడుస్తున్నాడు. చలిగాలి రివ్వున వీస్తోంది. దూరంగా వుత్సవం తాలూకు సందడులు వినిపిస్తోన్నాయి శివరావు వేగంగా నడుస్తూ యింటికి చేరుకున్నాడు.

ఆ యింటి చుట్టుప్రక్కల మరో యిల్లు లేదు.

ఇంటికి చేరుకున్న శివరావుకు వెంట్రుకలు నిక్క బొడుచుకున్నాయి. ఏదో అనుమానం వచ్చింది. తాత్సారం చెయ్యకుండా తలుపును బలంగా తన్నాడు.

తలుపులు తెరచుకున్నాయి.

లోపలి దృశ్యాన్ని చూసిన శివరావు రక్తం వుడికి పోయింది.

తండ్రి క్రింద రక్తం మడుగులో పడున్నాడు. మంచం మీద తల్లిని నాయుడు ఆక్రమించుకుంటున్నాడు.

శివరావు వడిగా లోపలకు వెళ్ళాడు. నారాయణ రావు గుండెల్లో వున్న కత్తిని బయటకు లాగాడు. నాయుడుని కసిదీరా పొడిచాడు. తల్లి మానాన్ని కాపాడాడు. తండ్రి చావుకి ప్రతీకారం తీర్చుకున్నాడు.

నాయుడిగారి హత్యావార్త ఆ వూళ్ళో చాలా అలజడిని లేపింది.

పెద్దవాళ్ళందరూ ఒకటైపోయారు.

నారాయణరావు; తన భార్యను నాయుడికి తార్చేవాడనీ, విషయం తెలిసిన శివరావు అవమానంతో కుమిలిపోయాడని, అవకాశంకోసం కాచుకున్నాడనీ, అవకాశం రాగానే తండ్రినీ, నాయుడినీ చంపేశాడనీ___ మరి తల్లిని ఎందుకు చంపలేదో తెలియదని___సాక్ష్యాలు సృష్టించారు. శివరావు పారిపోయాడు.

ఆ వూరికి క్రొత్తగా వచ్చిన ఇన్‌స్పెక్టర్-సత్తిరాజు

యిదంతా నిజం అని నమ్మాను. శివరావుని పట్టుకుంటా
నని ప్రతిజ్ఞ చేశాడు.

శివరావుకు తరువాత ఏం చెయ్యాలో అర్థం కాలేదు. అతనికి ఆ సమయంలో ఏం చెయ్యాలో తెలియక అలా ప్రవర్తించాడు. తీరా తెలివి వచ్చాక, తను చేసిన తప్పును తెలుసుకుని పశ్చాత్తాపపడ్డాడు. చేసిన తప్పుకు తను శిక్షను అనుభవించటానికి సిద్ధమే. కానీ తనపై చిన్న తండ్రిని చంపిన నేరాన్ని మోపారు. రెండు హత్యలను చేశాడన్న ఆరోపణను నమ్మిన న్యాయస్థానం ఉరిశిక్ష ఖాయం చేసి తీరుతుంది.

ఉరిశిక్షే గనక ఖాయం అయితే తన తల్లీ, చెల్లీ యేమయిపోతారు.

తల్లి పోలీస్ స్టేషన్లో తనపై అత్యాచారం జరుగుతోండగా శివరావు వచ్చాడనీ, తన తండ్రిని చంపి తల్లిని పాడు చెయ్యబోతోన్న నాయుడును, తన మాన రక్షణకోసం చంపాడనీ స్టేట్ మెంటు యిచ్చింది.

కానీ ఆమె స్టేట్ మెంటును పట్టించుకునే నాథుడే లేకపోయాడు.

చేసేదిలేక శివరావు నల్లమలై అడవులకు పారిపోయి వచ్చాడు. దొంగతనాలు మొదలు పెట్టాడు.

8

చెప్పడం ఆపి శివరావు గట్టిగా ఊపిరితీశాడు.

వసుధ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "ఆ ఘోరం జరిగే టప్పుడు మీ చెల్లి అక్కడ లేదా!" అంది.

"లేదు. నవమి పందిట్లో వుంది! దాన్ని మళ్ళీ నేను పెళ్ళి పందిట్లో చూడటమే."

వాళ్ళిద్దరూ యింకా అనేక విషయాల గురించి మాట్లాడుకున్నారు.

మెల్ల మెల్లగా వసుధ అతనిపట్ల ఆకర్షితురాలయి పోతోంది.

రాత్రంతా ఎలా గడిచిందో వాళ్ళకే తెలియదు.

తూర్పున తెల్లగా తెలవారుతోంది.

"మీ సంగతి తెలిస్తే, మీ చెల్లి భర్త ఆమెను ఏలు కుంటాడనుకుంటున్నారా?" అని అడిగింది వసుధ.

"నా గురించి అతనికి తెలుసు. కానీ యిప్పుడు ఇంత బరితెగించానని తెలిస్తే ఏం చేస్తాడో మాత్రం తెలి యదు."

వున్నట్టుండి వసుధకు తను చెట్టుకు కట్టిన చీర చెరగు గుర్తుకు వచ్చింది. ఆమె మనసు విలవిలలాడిపోయింది. తనకు ఏ అపకారం చేయని ఒక మంచి వ్యక్తిని మోసం చేస్తున్నానేమో అని బాధపడింది. శివరావుతో యేదో చెప్పబోయింది.

కానీ అప్పటికే ఆలస్యం అయిపోయింది.

మృత్యువు శివరావుకోసం గుహ బయట కాపుకాసిం దని ఆమెకు తెలియదు. మా లేసిన మృత్యువుకు శివరావు బలికావటానికి నూటికి నూరుపాళ్ళు తనే కారణం అని గ్రహించ గలగటం తప్ప ఆమెకు చివరకు ఏమీ మిగలదు.

ఆమె ఏం చెప్పబోతుందో—అని ఎదురుచూస్తోన్న శివ రావుకు వెన్ను జలదరించింది. వెంట్రుకలు నిక్కబొడుచు కున్నాయి. చురుకుగా లేచి నిలబడ్డాడు. గుహ బయటకు వచ్చాడు. అదే అతనుచేసిన పొరపాటు.

సూర్యుడు తూరుపు కొండలపైకి వస్తోన్నాడు. అతడి కిరణాలు తీక్ష్ణతను పుంజుకుంటున్నాయి.

నల్లమలై ఘాటురోడ్డుమీద జీపు పరుగెడుతోంది.

శివరావు నల్లమలై అడవులలో వున్నాడని మాత్రం బలమైన ఆధారాలు వున్నాయి. కానీ యెక్కడున్నాడో మాత్రం చూచాయిగానైనా తెలియదు. పోనీ ఫోర్సును పెట్టి వెతికిద్దామా! అంటే అతని చేతిలో యిప్పుడు వసుధ వుంది. పొరపాటు జరిగితే ఆమె ప్రాణానికి ముప్పువాటిల్లే అవకాశం వుంది. సత్తిరాజుకు చేతులు కట్టేసినట్టయింది.

జీపు పెద్ద కొండవాలు దగ్గరకు వచ్చింది.

"ఇక్కడ దిగి మొహాలు కడుక్కొని ముందుకు వెళదాం!" అన్నాడు సత్తిరాజు.

అతని నోటినుండి ఆ మాట వచ్చిందో లేదో—కానిస్టేబుల్సు ఒక్క వుదుటున క్రిందకు దూకేశారు.

సత్తిరాజు జీపు దిగి—నోట్లో పందుంపుల్ల పెట్టుకుని నములుతూ పచార్లు ఆరంభించాడు.

పచార్లు చేస్తోన్న వాడల్లా పైకి చూశాడు.

కొండవాలుగా ఒక చెట్టు వ్రేలాడుతోంది. క్రింద నుండి పైకిచూసేవాళ్ళకు అది మీదపడుతుందేమో అనిపిస్తుంది. ఆ చెట్టుకు చుట్టబెట్టుకొని ఒక కొండచిలువ క్రిందకూ మీదకూ జారుతోంది.

సత్తిరాజును ఆకర్షించింది, ఆ చెట్టు కాదు, దానికి వున్న కొండచిలువకాదు. సన్నటి ఆధారానికి వ్రేలాడుతోన్న చిన్న చెట్టు కొమ్మ. అది అతనికి ఏదో అసహజంగా అనిపించింది. అడవిలో ఓపికగా యెవరూ అలాటి

పనులు చేయటానికి రారు. ఎవరో కావాలని అలా చేశారు. అంటే దీని వెనుక బలమైన కారణం వుండి తీరుతుంది. అతని పోలీసు మెదడు తీవ్రంగా పనిచేసింది.

వెంటనే తనవాళ్ళను తీసుకొని జీపెక్కాడు, వలయంలా తిరిగి జీపు ఆ చెట్టు దగ్గరకు వచ్చింది. పిస్టల్ తీసి కొండచిలువకు గురిచూసి కాల్చాడు సత్తిరాజు.

అది గింగిరాలు కొడుతూ, క్రింద పడిపోయింది. సైలన్సరు అమర్చి వుండటంవలన పిస్టల్ పేలిన మోత అంతగా లేదు.

ఒక కానిస్టేబుల్ నెమ్మదిగా చెట్టుమీదకు పాకి చీర చెరగును విప్పి తీసుకొని వచ్చాడు సత్తిరాజు ఆ చెరగును బాగా పరిశీలించాడు. అందులో వున్న కాగితాన్ని బయటకు తీశాడు.

అది శివరావు గుహను తెలిపే కాగితం.

వసుధ తెలివితేటలకు సత్తిరాజు జోహార్లర్పించి జీపును ముందుకు వురికించాడు. డ్రైవింగ్‌ను స్వయంగా చేశాడు.

పదినిముషాలలో కాగితం ప్రకారం గుహ పరిసరాలకు వచ్చారు.

జీపును దూరంగా ఆపి నెమ్మదిగా అడుగులు వేస్తూ గుహ దగ్గరకు నడిచాడు సత్తిరాజు. అతడి అనుచరులు కూడా అతడిని అనుసరించారు.

అందరి చేతులలోనూ పిస్తోళ్ళు ప్రత్యక్షమయ్యాయి.

సత్తిరాజు అనుచరులకు సూచనలు ఇచ్చాడు— వాళ్ళందరూ వలయంగా యేర్పడి ముందుకు నడిచారు.

అంతలో శివరావు సుడిగాలిలా బయటకు వచ్చాడు

పోలీసుల చేతుల్లోని పిస్తోళ్ళన్నీ ఒకేసారి గర్జించాయి.

గిలగిలా తన్నుకుంటూ నేలమీద పడిపోయాడు శివరావు.

ఆ దృశ్యాన్ని చూసి కళ్ళుతిరిగి పడిపోయింది వసుధ.

సత్తిరాజు మాత్రం తన విధిని సక్రమంగా నిర్వహించానన్న తృప్తితో శివరావు శవాన్నీ, అదే స్థితిలో వున్న వసుధను తీసుకొని వెనుదిరిగాడు.

—: అయిపోయింది :—